
క్లుప్తంగా

సమ్మర్ క్యాంపులో 'కథలు'



రాజుపాళెం : సమ్మర్ క్యాంపులో భాగంగా రాజుపాళెంలోని గ్రంథాలయంలో పదవ రోజైన బుధవారం విద్యార్థులకు కథలను చెప్పినట్లు గ్రంథాలయ అధికారి ఎస్.ప్రతాపుడు తెలిపారు. 24 మంది విద్యార్థులు హాజరయ్యారని, కథలు, పద్యాలు చదవడం, క్యారమ్స్, చెస్ మెడిటేషన్ గురించి వివరించామన్నారు.

నేడు గుంతచీపాడులో ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం

చాపాడు : చియ్యపాడు గ్రామ సచివాలయ పరిధిలోని గుంతచీపాడు గ్రామంలో గురువారం ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్ కుమార్ తెలిపారు. ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వైద్య శిబిరంలో అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేసి మందులను పంపిణీ చేస్తారన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

నేడు సోమాపురంలో గడప గడపకు మన ప్రభుత్వం

చాపాడు : మండలంలోని సోమాపురం గ్రామంలో గురువారం ఉదయం 6 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షుడు తెలిదేల లక్షుమయ్య తెలిపారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకావాలని ఆయన కోరారు.

నేడు ఖత్నా కార్యక్రమం

మైదుకూరు : మైదుకూరులో గురువారం ముస్లిం వెల్ఫేర్ ట్రస్టు ఆధ్వర్యంలో ఖత్నా (వడుగులు) కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మైనారిటీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మదీనా దస్తగిరి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కడప రోడ్డులోని షాదీఖానాలో నిర్వహించే ఈ కార్యక్రమాన్ని ముస్లింలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వడుగులు చేయించుకున్న పిల్లలకు పౌష్టికాహారం అందజేస్తామని పేర్కొన్నారు.

నేడు క్రీస్తు విజ్ఞాన సభ

ప్రొద్దుటూరు : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో నిర్వహిస్తున్న క్రీస్తు విజ్ఞాన సభకు గురువారం సాయంత్రం ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి హాజరుకానున్నట్లు ఆర్గనైజర్ పడకండ్ల సుధాకర్‌రావు తెలిపారు. కార్యక్రమానికి ప్రసంగీకులు డాక్టర్ లాజరస్ ప్రసన్న బాబు హాజరవుతారని పేర్కొన్నారు.

పర్యావరణంపై అవగాహన



పర్యావరణంపై అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

మైదుకూరు : పర్యావరణంపై అటవీశాఖ వనిపెంట రేంజ్ అధికారులు బుధవారం మైదుకూరులోని పలు విద్యాసంస్థల్లో సమ్మర్‌కోచింగ్ సెంటర్లలో ఉన్న విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక బాల శివయోగేంద్ర మహారాజ్ డిగ్రీ కళాశాలలో వారు మాట్లాడుతూ పర్యావరణ అనుకూల జీవనశైలి వల్ల భూమిపై సానుకూల ప్రభావం చూపుతుందని తెలిపారు. ఇంధనం, నీటిని పొదుపు చేయడం, ఒకసారి వినియోగించే ప్లాస్టిక్‌ను నిషేధించడం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తగ్గించడం చేయాలని సూచించారు. కార్యక్రమంలో వనిపెంట రేంజ్ ఎఫ్ఎస్ఓ పీపీ సుబ్బరాయుడు, ఎఫ్‌బీఓలు ఎస్.రామసుబ్బారెడ్డి, సురేంద్ర, ఏబీఓ గంగాధర్, కళాశాల ప్రిన్సిపాల్ ఎస్‌బీ సురేష్, బాబు పాల్గొన్నారు.

విద్యార్థులకు దేశ భక్తి గేయాల పోటీలు



దేశ భక్తి గేయం ఆలపిస్తున్న విద్యార్థిని

ప్రొద్దుటూరు : స్థానిక వసంతపేట మున్సిపల్ హైస్కూల్‌లో రామేశ్వరం బాలబాలికల గ్రంథాలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి శిక్షణ శిబిరంలో బుధవారం విద్యార్థులకు దేశ భక్తి గేయాల పోటీలు నిర్వహించారు. పుట్టపర్తి సాహితీపీఠం కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం, రచయిత, ఉపాధ్యాయుడు డీకే చదువుల బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన దేశభక్తి పోటీల్లో 38 మంది విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయ రికార్డు అసిస్టెంట్ ఇబ్రాంసాహెబ్, యోగా టీచర్లు శ్రావణి, వెంకటసుబ్బమ్మ, జిరాఫీ చెస్ కోచ్‌అరవింద్ తేజస్ పాల్గొన్నారు.

పాదయాత్రతో లోకేష్ చేసేదేమీ లేదు

- ప్రజల కిచ్చిన మాటను నిలబెట్టుకున్నాం
- ఎమ్మెల్యే రాచమల్లు



వెలవలిలో కమిటీ సభ్యులకు రూ.3 లక్షల నగదును పంపిణీ చేస్తున్న నారాయణరెడ్డి చిత్రంలో ఎమ్మెల్యే రాచమల్లు

రాజుపాళెం : పాదయాత్ర ద్వారా నారా లోకేష్ ప్రజలకు చేసేదేమీ లేదని, గతంలో చంద్రబాబు ప్రజలకిచ్చిన మాట నిలబెట్టు కోలేదని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి విమర్శించారు. మండలంలోని వెలవలిలో బుధవారం ఎమ్మెల్యే రాచమల్లు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ ప్రభుత్వంలో ప్రజలకు చెప్పిన హామీలన్నీ నెరవేర్చక పోవడంతో నీరుగారి పోయాయన్నారు. అదే జగనన్న ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడం జరిగిందని గుర్తు చేశారు. 2014–19 సంవత్సరంలో చంద్రబాబు ప్రభుత్వంలో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి ఎన్ని నిధులు ఇచ్చారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాడు. రూ.లక్ష రూపాయలు కూడా నిధులు ఇవ్వలేదని, ప్రొద్దుటూరులో దోమల కాటు వల్ల విష జ్వరాలతో వందల మంది మరణించిన విషయం అసెంబ్లీలో చెబితే కాలువల ఆధునీకరణ చేయాలని చెబితే పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఏ తప్పు చేయలేదని, 2019లో జగనన్న ఏవాగ్దానం చెప్పారో అన్ని చేశారని తెలిపాడు. ప్రభుత్వంపై అసంతృప్తి లేనప్పుడు పాదయాత్ర ఎందుకు చేస్తున్నావ్ లోకేష్ అంటూ ఎద్దేవా చేశాడు. నీ స్థాయి ప్రభుత్వాన్ని విమర్శించే స్థాయి కాదని, గతంలో చేసిన ప్రతి అంశానికి సీబీఐ విచారణ కోరానని, కోర్టులో కేసు వేసుకోమన్నా వేసుకుంటానని తెలిపాడు. లోకేష్ పాదయాత్ర పార్టీ అధికారంలోకి రాలేదన్నారు.


శివాలయం వద్ద సమాధానం చెప్పాలి

ప్రొద్దుటూరులోని శివాలయం వద్ద ప్రొద్దుటూరులో ఏం అభివృద్ధి చేశావో, ఎంత చేశావో చెప్పాలని ఎమ్మెల్యే రాచమల్లు డిమాండ్ చేశాడు. రెండే రెండు ప్రశ్నలకు లోకేష్ సమాధానం చెబితే పాదయాత్రగా ప్రొద్దుటూరుకు రావాలని, లేకుంటే అర్హత ఉండదని ఎమ్మెల్యే తెలిపారు.

రూ.3 లక్షలు విరాళం

మండలంలోని వెలవలి గ్రామంలోని హరిజనవాడలోని రామాలయానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి బుధవారం రూ.మూడు లక్షలు విరాళం ఇచ్చాడు. గతంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి ద్వారా దళితవాడ వాసులు ఆలయానికి విరాళం ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరారని, ఆ కోరిక మేరకు ఈ ఆర్థిక సహాయం చేసినట్లు ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు వైస్ చైర్మన్ సూర్యనారాయణ రెడ్డి, సర్పంచ్ మహబూబ్ బాష, ఉప సర్పంచ్ అరుణ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు శివశంకర్‌రెడ్డి, రమణారెడ్డి, సచివాలయాలయ కన్వీనర్ వెలవలి శేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

టీడీపీకి చేనేతలంటే అలుసా




మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : దాదాపు రూ.40లక్షలు డ్వాక్రా మహిళలను మోసం చేసిన టీడీపీ పట్టణాధ్యక్షురాలు బోగాల లక్ష్మీనారాయణమ్మను సస్పెండ్ చేయకుండా చేనేత కులానికి చెందిన టీడీపీ కౌన్సిలర్ గాజుల శివజ్యోతిని సస్పెండ్ చేయడం ఏమాత్రం సబబు కాదని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి తెలిపారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో తన ఛాంబర్‌లో ఆమె విలేకరులతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి ఎన్నికల్లో ఓటు వేసిందనే కారణంగా టీడీపీ కౌన్సిలర్ గాజుల శివజ్యోతిని పార్టీ సస్పెండ్ చేసిందన్నారు. ఇదే తరహాలో మహిళలను మోసం చేసి జైలుకు వెళ్లి వచ్చిన లక్ష్మీనారాయణమ్మను ఆ పార్టీ సస్పెండ్ చేయకపోవడం కారణం, ఆమెది అగ్రకులం అనేనా అని ప్రశ్నించారు. మున్సిపాలిటీలోని 41 మంది కౌన్సిలర్లలో టీడీపీ కౌన్సిలర్ శివజ్యోతి ఒక్కరు మాత్రమేనని, ఆమెకు తమ పార్టీ అందరితోపాటు సమానంగా పనులను మంజూరు చేస్తోందన్నారు. టీడీపీ అని ఆమెను ఏనాడూ మేము దూరంగా ఉంచలేదని తెలిపారు. బీసీలకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పెద్ద పీట వేసిందని, టీడీపీ మాత్రం మోసం చేసిందని అన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు పోసా వరలక్ష్మి, రావులకొల్లు అరుణ, గరిశపాటి లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ఓటమి ఎరుగని నాయకుడు ఎమ్మెల్యే రాచమల్లు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు నియోజకవర్గంలో ఓటమి ఎరుగని నాయకుడు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అని, జయాప జయాలు ప్రజలు నిర్ణయిస్తారని 4వ వార్డు కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక వైఎంఆర్ కాలనీలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డిని మాజీ చేస్తానన్న వ్యాఖ్యలపై ఆయన మండిపడ్డారు. గడిచిన మున్సిపల్ ఎన్నికల్లో సొంత వార్డును గెలిపించుకోలేని ప్రవీణ్ ప్రొద్దుటూరు నియోజకవర్గంలో టీడీపీ జెండాను ఎగరవేసి ఎమ్మెల్యే రాచమల్లును మాజీ చేస్తానని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఎద్దుల రాయపురెడ్డి, కేకే కొండారెడ్డి పాల్గొన్నారు.

రక్తపోటుపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ డి.నరసింహారెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : జీవనశైలి వ్యాధులలో ఒకటైన రక్తపోటుపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని జనవిజ్ఞాన వేదిక వ్యవస్థాపక నాయకుడు డాక్టర్ డి.నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక జేవీవీ కార్యాలయంలో ప్రపంచ అధిక రక్తపోటు దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ రక్తపోటు 120/80 ఉండాలని, అంతకంటే ఎక్కువ ఉండటం అధిక రక్తపోటుకు సూచిక అని తెలిపారు. గుండె, రక్తనాళాలు సరిగా పని చేయకపోవడంతో అధిక రక్తపోటు వస్తుందని పేర్కొన్నారు. ఇతర అనారోగ్య సమస్యలు, అవయవాల పనితీరు సరిగా లేకపోయినా రక్తపోటు వస్తుందన్నారు. అధిక రక్తపోటు వచ్చినవారు ఆహారంలో మార్పులు చేయాలని సూచించారు. జేవీవీ రాష్ట్ర కార్యదర్శి తవ్వా సురేష్ మాట్లాడుతూ జీవనశైలిని శాస్త్రీయంగా కొనసాగించాలని అప్పుడే ఆరోగ్యంగా ప్రజలు ఉంటారని అన్నారు. జేవీవీ పట్టణ ప్రధాన కార్యదర్శి సునీత, అడ్వకేట్ హరిత, కోఆర్డినేటర్స్ అజర్, అక్షయ, గురప్ప, చరణ్, మహిధర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసేందుకు యత్నం




గుడిసెలు వేసే ప్రాంతంలో సీపీఎం నాయకులను హెచ్చరిస్తున్న తహసీల్దారు దామోదర్‌రెడ్డి

గోపవరం : మండలంలోని బేతాయపల్లె గ్రామ పంచాయతీ, పి.పి.కుంటలో గోపవరం రెవెన్యూ పొలం 1622 సర్వే నెంబరు గల భూమిలో బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో పేదలు గుడిసెలు వేసేందుకు ప్రయత్నించగా సమాచారం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు, పోలీసులు అడ్డుకున్నారు. ఎవరి మాటలో విని అనుమతి లేకుండా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసేందుకు ప్రయత్నిస్తే తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని తహసీల్దారు దామోదర్‌రెడ్డి సీపీఎం నాయకులను, ప్రజలను హెచ్చరించారు. ప్రభుత్వం ఇప్పటికే నవరత్నాల్లో భాగంగా ఇళ్ళులేని ప్రతి పేదవాడికి ఇళ్ళ స్థలాలు ఇచ్చి ఇళ్ళు కూడా నిర్మించి ఇస్తుందని తెలిపారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్ళ నిర్మాణాలు జరుగుతున్నాయని, ఇంకా అర్హత ఉండి ఇళ్ళు లేని వారు ఉంటే ఆయా సచివాలయాల్లో దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి స్థానికంగానే జగనన్న కాలనీలో స్థలాలు కేటాయిస్తామన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని, ఎవరో చెప్పిన మాటలు విని కేసుల్లో ఇరుక్కోకూడదని హెచ్చరించారు. వెంటనే ఇక్కడ నుండి ఖాళీ చేసి వెళ్ళిపోవాలని తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఎస్ఐ చంద్రశేఖర్‌లు హెచ్చరికలు జారీ చేశారు. అక్కడి నుంచి కదలకపోవడంతో తహసీల్దారు బద్వేలు ఆర్డీఓ వెంకటరమణకు సమాచారమిచ్చారు. వెంటనే సీపీఎం నాయకులపై బైండోవర్ కేసు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశాలు ఇవ్వడంతో సీపీఎం నాయకులు ఖాదర్‌బాష, నరసింహులు, అన్వేష్, శివకుమార్, కదిరయ్యలపై బండోవర్ కేసు నమోదు చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఆర్ఐ అమర్‌నాథ్‌రెడ్డి, వీఆర్వో వెంకటేశ్వర్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బలహీన వర్గాల అభివృద్ధే సీఎం వైఎస్ జగన్ ధ్యేయం

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి



ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

మైదుకూరు : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి అన్నారు. బుధవారం సాయంత్రం మున్సిపాలిటీలోని 11వ వార్డు పరిధిలో ఉన్న గడ్డమాలవాడ, 10వ వార్డులోని సర్వాయిపల్లె గ్రామాల్లో ఎమ్మెల్యే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల ద్వారా పొందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారు సామాజిక, ఆర్థిక రంగాలతోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలనేది సీఎం వైఎస్ జగన్ లక్ష్యమని తెలిపారు. అందుకే వీరి సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తున్నారన్నారు. గడ్డమాలవాడలో పలువురు తమ సమస్యలను విన్నవించగా ఎమ్మెల్యే పరిష్కారానికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ పిల్లి ఇందిరా రమణి, మాజీ ఎంపీటీసీ పిల్లి నాగయ్య, 10వ వార్డు ఇన్‌చార్జి చంద్ర ఓబుళరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, మహిళా విభాగం అధ్యక్షురాలు కిరణ్మయి, ఎస్సీ విభాగం జిల్లా కార్యదర్శి రవి, మైదుకూరు ప్రభుత్వ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు భూమిరెడ్డి నరసింహులు, భరత్‌కుమార్‌రెడ్డి, 14వ వార్డు ఇన్‌చార్జి శ్రీనివాసరావు, వీరభద్రుడు, మైనారిటీ నాయకులు షౌకత్ ఆలీ, అక్బర్, ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని దాటిన మార్కెట్ కమిటీకి ప్రశంసలు

ఆదాయంలో లక్ష్యంకంటే ఎక్కువ మొత్తాన్ని సాధించిన మైదుకూరు వ్యవసాయ మార్కెట్ కమిటీకి మార్కెటింగ్ శాఖ నుంచి ప్రశంసలు లభించాయని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి తెలిపారు. బుధవారం మార్కెట్ కమిటీ కార్యాలయంలో త్రైమాసిక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్థానిక నంద్యాల రోడ్డులో నుంచి పశువుల సంతను బద్వేలు రోడ్డులోని గగ్గితిప్ప వద్దకు మార్చడాన్ని పలువురు విమర్శించారన్నారు. అయితే అక్కడికి వెళ్లిన తర్వాత ఆదాయం రెట్టింపు అయిందని చెప్పారు. మార్కెట్ కమిటీ ఆదాయం రూ.1.65 కోట్లు లక్ష్యం కాగా రూ.2.11 కోట్లు సాధించిందన్నారు. కాగా నంద్యాల రోడ్డులో పాత సంత స్థలంలో రైతు బజార్‌ను ఏర్పాటు చేయనున్నామని, గగ్గితిప్ప వద్ద రైతులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు రూ.2కోట్లతో ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమన్నారాయణరెడ్డి, మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర, సింగిల్ విండో చైర్మన్ మూలె సుధాకర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ కార్యదర్శి మనోహర్ పాల్గొన్నారు.

20న రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు

కాశినాయన : మండలంలోని నరసాపురం గ్రామంలో శ్రీపోలేరమ్మ తిరునాల సందర్భంగా ఈ నెల 20వ తేదీన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి బహుమతిగా రూ.లక్ష, రెండవ బహుమతిగా రూ.75 వేలు, మూడవ బహుమతిగా రూ.50 వేలు, నాల్గవ బహుమతి రూ.40 వేలు, ఐదవ బహుమతి రూ.30 వేలు, ఆరవ బహుమతి రూ.20 వేలు పోటీల్లో గెలుపొందిన వృషభాలకు బహుమతులు అందజేయడం జరుగుతుందన్నారు. 20వ తేదీ ఉదయం 7 గంటల లోపు పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 8384106188 నెంబరును సంప్రదించాలని కోరారు.

పుస్తక పఠనం అలవరచుకోండి

కమలాపురం : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, వేసవిలో విద్యార్థులు గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే పుస్తక పఠనం అలవరచు కోవాలని కమలాపురం శాఖ గ్రంథాలయాధికారిణి నాగాంజలి తెలిపారు. స్థానిక గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా బుధవారం విద్యార్థులకు పుస్తక పఠనం, స్పోకెన్ ఇంగ్లీష్‌పై శిక్షణ నిచ్చారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

చెన్నూరు : మండల పరిధిలోని రామనపల్లి గ్రామపంచాయతీ మొడాలు గ్రామానికి సమీపంలో నున్న స్మశాననానికి వెనుక వైపున బుధవారం జూదమాడుతున్న నలుగురిని అరెస్ట్ చేసి వారిన నుంచి రూ.2010 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులరెడ్డి తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కలెక్టరేట్‌కు సమీపంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నూర్జహాన్ తెలిపారు. ఈ కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడి యంకు సంబంధించి ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు కలవని తెలిపారు. విద్యార్థు లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సామాజిక ఆరోగ్య కేంద్రానికి సామగ్రి వితరణ

చెన్నూరు : చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ వారు రూ.12.50 లక్షల విలువ కలిగిన సామగ్రిని వితరణ చేసినట్లు సామాజిక కేంద్ర వైద్యులు డాక్టర్.సతీష్‌కుమార్, డాక్టర్ దినకర్‌రెడ్డిలు తెలిపారు. బుధవారం విలేకరులతో మాట్లా డుతూ చెన్నూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలోకి వచ్చే ప్రజలకు, రోగులకు ఐసీయూ బెడ్లు–5, వీల్ చైర్స్–5, ఇన్స్ట్రుమెంట్ ట్యాలీలు–10, ఈసీజీ పరికరాలు–2, డెలివరీ బెడ్–1, ఎల్ఈడీ ఓటీ లైట్–1 ఇవ్వడం జరిగిందన్నారు. వారికి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.కంపెనీ మేనేజర్లు టీ.ఓబయ్య, నాగార్జునరావు పాల్గొన్నారు.

ఉల్లాసంగా .. ఉత్సాహంగా



కార్తీక్ స్కూల్‌లో భరతనాట్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు

బద్వేలు అర్బన్ : వేసవి సెలవులలో నిర్వహిస్తున్న వివిధ రకాల శిక్షణా శిబిరాలలో చిన్నారులు ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొంటున్నారు. తమలోని ప్రతిభను మరింత మెరుగుపరుచుకునేందుకు తీవ్రంగా కృషి చేస్తున్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న తైక్వాండో శిక్షణ శిబిరం విద్యార్థులతో సందడిగా మారింది. జేవీఎస్ తైక్వాండో అకాడమీ కోచ్ వెంకటసుబ్బయ్య తైక్వాండో క్రీడపై తనకున్న మక్కువతో జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ సుమారు 60 మంది విద్యార్థులు శిక్షణ తీసుకుంటున్నారు. పంచెస్, కిక్, లెగ్ మూమెంట్‌వంటి అంశాలలో శిక్షణ ఇస్తున్నారు. స్థానిక ఆంజనేయనగర్‌లోని కార్తీక్ స్కూల్‌లో భరతన్యాటం కళాకారుడు వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న భరతనాట్యం శిక్షణ శిబిరంలో చిన్నారులు నృత్య భంగిమలు, ముద్రలు నేర్చుకుంటున్నారు. ఇక్కడ చిత్రలేఖనం, పెయింటింగ్‌లో కూడా చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. అలాగే ఆంజనేయనగర్‌లో రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో కోచ్ టి.మహేష్ నిర్వహిస్తున్న షటిల్ బాడ్మింటన్ కోచింగ్‌లో చిన్నారులు చురుగ్గా పాల్గొంటున్నారు. చిన్నారులు వేసవి సెలవుల్లో తమలోని ప్రతిభకు పదును పెడుతుండటంతో తల్లిదండ్రులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

షార్ట్‌సర్క్యూట్‌తో కాలిన పత్తి



పత్తికి అంటుకున్న మంటలను ఆర్పుతున్న రైతులు

బి.కోడూరు : మండలంలోని ప్రభలవీడు గ్రామానికి చెందిన చెన్నుపల్లెరామిరెడ్డికి చెందిన సుమారు 20 క్వింటాళ్ళ పత్తి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నికి ఆహుతి అయింది. రామిరెడ్డి తనకున్న 7 ఎకరాల పొలంలో పత్తిపంటను సాగు చేసి 6 నెలలుగా శ్రమించి కూలీలతో పత్తిని సేకరించి తన పొలంలో ఉన్న గోడౌన్‌లో నిల్వ ఉంచారు. బుధవారం సాయంత్రం వీచిన గాలికి గోడౌన్‌లోని విద్యుత్ బోర్డు షార్ట్‌సర్క్యూట్ జరిగి అక్కడే నిల్వ ఉన్న పత్తి మీద నిప్పు రవ్వలు పడి అంటుకుంది. ఆ సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో గోడౌన్ నుండి పొగ వస్తుండటాన్ని గమనించిన చుట్టుపక్కల పొలాల వారు రామిరెడ్డికి తెలియజేయడంతో తోటి రైతులు మంటలను ఆర్పే ప్రయత్నం చేసినా పత్తి పొగసూచిగా మారడంతో మార్కెట్ చేసేందుకు పనికిరాకుండా పోయింది. ప్రమాదంలో సుమారు రూ.1.50 లక్షలు మేర నష్టం వాటిల్లినట్లు బాధితుడు రామిరెడ్డి వాపోయాడు. తనను అన్నివిధాలా ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు రామిరెడ్డి కోరుతున్నారు.


బదిలీపై వెళుతున్న ఎస్ఐకి సన్మానం



ఎస్ఐ నస్రీన్‌ను సన్మానిస్తున్న సీఐ, మండల నాయకులు

బి.కోడూరు : మండలంలోని బి.కోడూరు ఎస్ఐగా సుమారు రెండు సంవత్సరాల పాటు పదవీ బాధ్యతలు నిర్వర్తించి బదిలీపై వెళుతున్న ఎస్ఐ నస్రీన్‌కు బుధవారం మండల కేంద్రంలోని బి.కోడూరు పోలీసుస్టేషన్ ఆవరణలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. సీఐ హనుమంతనాయక్ ఆధ్వర్యంలో సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జెడ్పీటీసీ దావీదు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ మునిరెడ్డి, నాయకులు దుగ్గిరెడ్డి, లక్ష్మీనరసారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, రామకృష్ణారెడ్డిలు ఎస్ఐ నస్రీన్ చేసిన సేవలను కొనియాడటంతో పాటు శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అట్లూరు ఎస్ఐ రాధ, గోపవరం ఎస్ఐ చంద్రశేఖర్, నాయకులు రమణారెడ్డి, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



సబ్‌జూనియర్ హాకీ చాంపియన్‌షిప్‌కు ఎంపికైన క్రీడాపాఠశాల క్రీడాకారులు

కడప స్పోర్ట్స్: ఈ నెల 28 నుంచి జూన్ 1వ తేదీ వరకు పశ్చిమబెంగాల్ రాష్ట్రం చందర్ నగర్‌లో నిర్వహించనున్న 45వ సబ్‌జూనియర్ నేషనల్ వాలీబాల్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనే ఏపీ జట్టుకు ఉమ్మడి కడప జిల్లాకు చెందిన ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈనెల 13, 14 తేదీల్లో రాజమండ్రిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి సబ్‌జూనియర్ వాలీబాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు చక్కటి ప్రతిభ కనబరిచి ఏపీ జట్టులో చోటు సంపాదించారు. కడప వైఎస్ఆర్ క్రీడాపాఠశాలకు చెందిన టి. పావని, ఎస్. గాయత్రి, ఎస్. రుచిత, జి. శ్రీలక్ష్మి, జె. కుముదినిదేవి బాలికల జట్టుకు ఎంపికకాగా, రాజంపేటకు చెందిన సాయి ప్రతాప్ బాలుర విభాగంలో ఏపీ జట్టుకు ఎంపికయ్యారు. వీరంతా ఈనెల18 నుంచి 25వ తేదీ వరకు రాజమండ్రిలో నిర్వహించే రాష్ట్రస్థాయి వాలీబాల్ క్యాంపులో పాల్గొనాల్సి ఉంటుందని జిల్లా వాలీబాల్ సంఘం కార్యదర్శి ఖాదర్‌వల్లి పేర్కొన్నారు.

హాకీ సబ్‌జూనియర్ నేషనల్స్‌కు...

ఒడిశా రాష్ట్రం రూర్కెలాలో ఈ నెల 18 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి సబ్ జూనియర్ మెన్ హాకీ చాంపియన్‌షిప్‌కు కడప క్రీడాకారులు ఎంపికయ్యారు. ఈ పోటీల్లో పాల్గొనే ఏపీ జట్టుకు కడప వైఎస్ఆర్ క్రీడాపాఠశాల నుంచి ఏకంగా 5గురు ఎంపిక కావడం విశేషం. క్రీడాపాఠశాలకు చెందిన క్రీడాకారులు కె.చరణ్‌కుమార్, జి.చందు, ఎం.శ్రీనివాస్, ఎస్.మహమ్మద్, డి. దేవసాయియాదవ్‌లు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా క్రీడాపాఠశాల ప్రత్యేకాధికారి ఎస్.బాషామోహిద్దీన్, హాకీ శిక్షకులు అనిల్‌కుమార్, ఖాదర్‌బాషా అభినందనలు తెలిపారు.

అక్రమంగా మద్యం విక్రయిస్తున్న మహిళ అరెస్ట్

కడప అర్బన్: కడప నగరంలోని చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వైఎస్ఆర్ లే ఔట్‌లో నివాసం ఉంటున్న కొప్పర్తి కుమరమ్మ అనే మహిళ అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా సీఐ శ్రీరామశ్రీనివాసులు, తమ సిబ్బందితో కలిసి బుధవారం అరెస్ట్ చేశారు. నిందితురాలి వద్ద నుంచి 28 క్వార్టర్ బాటిళ్ల మద్యంను సీజ్ చేసినట్లు సీఐ తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. నిందితురాలిని అరెస్ట్ చేయడంలో కృషి చేసిన మహిళా పోలీస్ సిబ్బందిని సీఐ అభినందించారు.

నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు

పులివెందుల రూరల్ : నైపుణ్యాభివృద్ధితోనే ఉపాధి అవకాశాలు పొందవచ్చునని జిల్లా పరిశ్రమల అధికారిణి భువనేశ్వరి తెలిపారు. బుధవారం పులివెందులలో పులివెందుల, లింగాల, తొండూరు ఐటీఐ కళాశాలల విద్యార్థులకు ప్రత్యేక సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మా ట్లాడుతూ ఐటీఐ కోర్సులు పూరైన తర్వాత ఇంజనీరింగ్ కోర్సులకు ఎంతో దోహదపడుతుందన్నారు. నైపుణ్యాభివృద్ధి ఉంటే అవకాశాలు కూడా పొందవచ్చునన్నారు. పరిశ్రమలు ఎలా స్థాపించాలనే దానిపై అవగాహన కల్పించారు. స్టెప్ మేనేజర్ సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రపంచంలో ఏ దేశంలో లేని విధంగా దేశంలో 33 శాతం యువత ఉన్నారన్నారు. యువత కోసం ప్రభుత్వ విద్యా సంస్థలలో భాగమైన వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చి.. దీని ద్వారా చెడు మార్గంలో పయనించకుండా అవగాహన కల్పిస్తామని వివరించారు.